

కంటిచూపు లేనివాడు
గుడ్డివాడు కాదు
తన తప్పులను తెలుసుకోలేనివాడే
నిజమైన గుడ్డివాడు.
- మహాత్మా గాంధీ.

Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 312 | శనివారం 30 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## సిద్ధరామయ్య రాజీనామా ఆమోదం

**- ఢిల్లీలో కర్నాటక నేతల ప్రదక్షిణలు**
**- నేడు సీఎల్పీ భేటీ**



బెంగళూరు - సూర్య వాస్తవం

కర్నాటక సీఎం సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆమోదించారు. ఆయన మధ్యప్రదేశ్ పర్యటనలో ఉండటంతో గురువారం లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను గవర్నర్

- మిగతా 2లో..

## జూన్ 3న డీకే శివకుమార్ సీఎంగా ప్రమాణస్వీకారం

2






## నీట్ లీక్ పై నిలదీత

- ఎన్‌టీఏకు సుప్రీం ప్రశ్నలు
- లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందే
- ఇలాంటి ఘటనలు విద్యార్థులు, తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభ

3



## ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ

- చర్లపల్లి జైలుకు తరలింపు
- మూడు రోజుల పోలీసు విచారణ

3

# ఇకపై 'కట్టప్ప' లకే కాంగ్రెస్‌లో పెద్దపీట..!!




**- డీకే.శివకుమార్ చేతికి కన్నడ సీఎం పగ్గాలు..**
**- కే.సీఎల్‌పీ నేతగా ఎన్నికకు హై కమాండ్ ఆదేశం..**




కాంగ్రెస్ పార్టీ చివరి ప్రధానిగా మన్మోహన్ శకం ముగిసిన తరువాత.. దేశం వ్యాప్తంగా కుదేలైన ఆ పార్టీ దక్షిణాదిని ఊతంగా చేసుకొని తిరిగి నిలదొక్కుకునేందుకు కసరత్తులు చేస్తోంది. కాంగ్రెస్ ప్రధానులు శ్రీమతి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల ఆత్మ బలిదానం అనంతరం కాంగ్రెస్ నిర్వీ ర్యానికి బాహ్య శుత్రువులకేంటే ,అంతర్గత శక్తులే అలుపెరగక శ్రమించాయి. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా., కాంగ్రెస్ నావను నట్టేట ముంచే రహస్య ఎజెండాను, చడ్డీల సైగలతో,చడీ చప్పుడు లేకుండా అమలు పర్చాయి. పార్టీ పట్ల చిత్తశుద్ధి, అంకింత భావం కల వీర విధేయులకు పట్టం కట్టనిదే.. పార్టీ పునర్జీవనం సాధ్యం కాదనే చేదు నిజం అధిష్ఠానానికి అనుభవ పూర్వకంగా బోధ పడింది. పార్టీ అంటే పడిచచ్చే కట్టప్పలకు.. అన్నీ రకాల బాధ్యతలు కట్టబెడితేనే తప్ప పార్టీకి పూర్వ వైభవం సాధ్యం కాదనే నిశ్చితాభిప్రాయానికి వచ్చింది. ఆ పార్టీ అగ్రనేత, సీ.డబ్ల్యూ.సీ.సారథి రాహుల్ గాంధీ సైతం చివరాఖరుకు అదే నిర్ణయానికొచ్చారు. ఆఫార్ములాలో భాగంగానే దక్షిణాది కట్టప్ప, ట్రబుల్ షూటర్ డి కే. శివకుమార్‌కు సీఎం కిరీటం వరించనుంది. కన్నడ రాష్ట్రం 25వ ముఖ్యమంత్రిగా ఆయన రేపో,మాపో.. ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

మహమ్మద్ షఫీ అహ్మద్,
సూర్య వాస్తవం, ప్రత్యేక ప్రతినిధి,..

- దక్షిణాది ఊతంతో కాంగ్రెస్ ముందడుగు..
- వీర,విధేయులకే రాష్ట్ర కమిటీల పగ్గాలు..
- విశ్వసనీయత,సమర్థతలే అన్నింటా కొలమానం..
- 2029 నాటికి అధికారం దిశగా అడుగులు..
- ఆంధ్రాలో పార్టీ బలోపేతానికి సీఎంల వ్యూహం..
- సిద్ధరామయ్య స్థానంలో రాజ్యసభకు వైఎస్.షర్మిల..



అనేకానేక మలుపులు తిరిగి కన్నడ కాంగ్రెస్ రాజకీయం ఎట్టకేలకు కుదుట పడింది. ఆ పార్టీ అధిష్ఠానం అక్కడి సీఎం సిద్ధిరామయ్యను రాజీ నామాకు ఒప్పించింది. అనేకానేక తర్జన భర్జనల అనంతరం .. తాను పార్టీకి వీర విధేయుడిననే ప్రకటిస్తూ, ఆయన సీఎం పదవికి ఇటీవల రాజీనామా చేశారు. రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ శుక్రవారం నాడు ఆ రాజీనామాను ఆమోదించారు. రాజీనామా ప్రకటన అనంతరం సిద్ధిరామయ్య

- మిగతా 2లో..

# డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి

- సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి 'ఏపీ సైబర్ గార్డ్' ఏర్పాటు
- ఫిర్యాదు అందిన వెంటనే జీరో ఎఫ్‌ఐఆర్ నమోదుకు ఆదేశాలు
- ఆరు స్తంభాల వ్యవస్థతో సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రణాళిక
- ఏపీలో నేరం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని సీఎం స్పష్టం

అమరావతి - సూర్య వాస్తవం

"డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు శాఖను ఆదేశించారు. ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటుంటే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ పరిస్థితిని అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సైబర్ నేర రహితంగా మార్చడమే లక్ష్యమని, ఏపీ ప్రజలను మోసం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని ఆయన హెచ్చరించారు.



సచివాలయంలో సైబర్ నేరాల కట్టడిపై జరిగిన ఉన్నతస్థాయి

- మిగతా 3లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## సర్‌తో అందరికీ సమస్యే

- లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు నష్టం
- సర్ తో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలి
- దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం : సీఎం రేవంత్ రెడ్డి

3

# ఇకపై..'కట్టప్ప'లకే..

# కాంగ్రెస్‌లో పెద్దపీట..!!









(మొదటిపేజీ తరువాయి)

నేరుగా ఢిల్లీ వెళ్లి ఏ.ఐ.సీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేత, సీ.డబ్ల్యూ. సీ.సారథి రాహుల్ గాంధీని కలుసుకొని పార్టీ పట్ల తన విధేయతను ప్రకటించారు. సుదీర్ఘ కాలం సేవలకు ఫలితంగా అధిష్ఠానం ఆఫర్ చేసిన రాజ్యసభ పదవి తనకు అక్కర్లేదని సున్నితంగా తిరస్కరించారు. 7 కోట్ల కన్నడ ప్రజల సేవలో తరించేందుకు.. తాను ఎమ్మెల్యేగానే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కన్నడ ప్రజల సేవకు మాత్రమే తనను ప్రత్యేకించాలని, కేంద్ర రాజకీయాల పట్ల తనకు అంతగా ఆసక్తి లేదని అధిష్ఠానానికి ఒప్పించారు. మొత్తం మీద అధిష్ఠానం ఆయన విన్నపాన్ని మన్నించింది.

**కేసీఎల్‌పీ నేతగా డీకే శివకుమార్ ఎంపికకు ఆదేశం:-**

కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయం మేరకు.. కర్నాటక కాంగ్రెస్ లెజిస్‌లేటీవ్ కమిటీ సమావేశం, కన్నడ విధాన సౌధలో శనివారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. సిద్దిరామయ్య మంత్రి వర్గంలో డిప్యూటీ సీఎంగాను, ప్రస్తుత పీ.సీ.సీ. అధ్యక్షునిగాను బాధ్యతలు నిర్వర్తిస్తున్న డి.కే.శివకుమార్ ను సీ.ఎల్.పీ. సారథిగా ఎన్నుకోవాలని అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. ముందస్తు నిర్ణయం ప్రకారం, అంతా సవ్యంగా జరిగితే..డి.కే. శివకుమార్ కన్నడ రాష్ట్ర 25వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సీఎం పదవీ స్వీకార తేదీని లోక్ భవన్ వర్గాలు అధికారికంగా ప్రకటించనున్నాయి. కాంగ్రెస్ కష్ట, నష్టాల్లో డి.కే. శివకుమార్ అన్నింటా నిజాయితీ,నిబద్ధతగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆపద వచ్చినప్పుడల్లా, అవసరం ఏర్పిడనప్పుడల్లా , ఆ అవకాశం చేజిక్కించుకొని ఆయన ట్రబుల్ షూటర్‌గా బాధ్యతలు మోస్తున్నారు. అధిష్ఠానం మెచ్చే విధంగా,ఆపదను గట్టెక్కించి..పార్టీ శ్రేయస్సు పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటూ వస్తున్నారు. కన్నడ నాట కాంగ్రెస్ అన్నింటా కుదేలైనా 2023లో తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు తన శక్తికి మించి శ్రమించారు.

**ట్రబుల్ షూటర్‌గా కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు:-**

కుల,మత వర్గాల సమీకరణలతో, నిత్యం కుంపటిగా మండే .. కన్నడ రాజకీయాలను ఆయన తన దైన శైలిలో బేరీజు వేసి, పార్టీకి అనుకూలంగా మల్చ డంలో సిద్ధహస్తుడని పించుకున్నారు. వాస్తవానికి 2023 నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజార్టీ సాధించడంలో శివకుమార్ కృషి ఎనలేనిది. సామా జిక సమీకరణలు సహకరించక పోయినా, ఒంటిచేత్తో కాంగ్రెస్ పార్టీని ఆయన విజయపథం వైపు నడిపించారు. వాస్తవానికి అప్పట్లోనే ఆయనకు సీఎం పదవి దక్కాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలను అదృశ్య రూపంలో శాసించే.. అంతర్బాహ్య శక్తుల ప్రమేయంతో ఆయనకు అప్పట్లో సీఎం పదవి చేజారింది. సామాజిక సమీకరణలు అడ్డు గోడలుగా మారడతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన్ను త్యాగాలకు సిద్ధ పడమని ఒప్పించి, సీఎం పదవినుంచి తప్పించి సిద్ధ రామయ్యకు పట్టం కట్టింది. అప్పటి ఒప్పందం ప్రకారం సగకాలం తరువాత, సీఎంగా సిద్ధ రామయ్య స్వచ్ఛందంగా దిగిపోయి.. ఆ స్థానంలో డి.కే.శివకుమార్‌కు అవాకాశం ఇవ్వాల్సి ఉంది.

**సిద్ధ రామయ్య రాజీనామాలో హైడ్రామా:-**

ఒప్పందం ప్రకారాం కాలపరిమితి దాటినా సీఎం పదవికి సిద్ధ రామయ్య రాజీనామా విషయంలో కన్నడ కాంగ్రెస్‌లో ఓ వారం రోజులుగా హైడ్రామా చోటు చేసుకుంది. అధిష్ఠానం రాజీనామా సూచనకు తాను బద్ధుడిగా ఉన్నట్లు సీఎం సిద్ధ రామయ్య పైపైకి నమ్మించే ప్రయత్నం చేశారు. అందుకు ఆయన అనుచరులు, మంత్రి వర్గ సహచరులు రాజీనామా వద్దని ఒత్తిడి పెంచారు. ఒక దశలో తన అనుయాయులకు నచ్చచెప్పేందుకు సీఎం సిద్ధ రామయ్య అల్పాహారానికి తన అధికారిక నివాస గృహం కావేరికి ఆహ్వానించి తనవారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అనూహ్యంగా డిప్యూటీ సీఎం హెూదాలో డీ.కే.శివకుమార్ కూడా అల్పాహార విందుకు హాజరై సిద్ధ రామయ్య కాళ్లకు నమస్కరించి ఆశీస్సులు పొందారు. దాంతో అధికార మార్పిడి సునాయాసంగా జరిగిపోతుందనే సంకేతాలు బలంగా బయటకు వెళ్లాయి. మరో వైపు డి.కే.శివకుమార్ ఇంటి వద్ద ఆయన అనుయాయులు బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఆపై రాష్ట్రగవర్నర్ అందుబాటులో లేక పోయినా సిద్ధ రామయ్య తన రాజీనామా లేఖను లోక్ భవన్ అధికారిక వర్గాలకు అందజేశారు. ఆ పిదప ఆయన ఢిల్లీ వెళ్లి అధిష్ఠానంతో భేటి అయ్యారు. ఈ లోగా సీఎం పదవికి గవర్నర్ చేత రాజీనామా ఆమోదం, చకచకా జరిగి పోయాయి. ఈ వ్యవహారన్నంతిటినీ ఏఐసీసీ ప్రధాన కర్యదర్శి, కర్నాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ రణదీప్ సింగ్ సూర్జేవాల..ఇరువర్గాల మధ్య అధిష్ఠానం దూతగా వ్యవహరిస్తూ.. అత్యంత చాకచక్యంగా నడిపించి..చివరాఖరుకు సుఖాంతం చేశారు.

**చాకచక్యంగా వ్యవహరించిన అధిష్ఠానం :-**

సీఎం సిద్ధ రామయ్య రాజీనామాకు సిద్ధ పడితే పార్టీ చీలిపోతుందని, క్రొపార్టీకీ అవకాశం ఉందని,ఆధిపత్య కులాలు లింగాయత్,ఒక్కలింగ సమీకరణలు తారుమారౌతాయని,కన్నడ నాట కాంగ్రెస్‌కు గడ్డుకాలం ఖాయమని ప్రసార,ప్రచార మాధ్యమాలు కోడై కూశాయి. కన్నడ దళిత, హిందళిత,అహింద సంఘాలు,రాజీనామా పర్యవసనాలపై ఉద్యమిస్తామని హెచ్చరించాయి. కాంగ్రెస్ చీలికను,పేలికను ఆశిస్తున్న వ్యతిరేక పార్టీలు తమ వ్యూహాలక పదును పెట్టాయి. ఈ పరిణామాలన్నింటినీ ముందస్తుగా ఊహించిన కాంగ్రెస్ అధిష్ఠానం,ప్రధానంగా అగ్రనేత రాహుల్ గాంధీ ఎప్పటికప్పుడూ వ్యవహారాలను సమీక్షిస్తూ,అవసరమైన సలహాలు, సూచనలు, సంప్రదింపులు ఏఐసీసీ దూత ద్వారా నడిపి సీఎం పదవికి సిద్ధ రామయ్య రాజీనామా అంశాన్ని సుఖాంతం చేశారు. దక్షిణ భారతంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఓ మాటలో చెప్పాలంటే వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తోంది. రాజకీయ రాద్ధాంతానికి ఆస్కారం లేకుండా సిద్ధాంతపరమైన సారూప్యతను కూర్చి కర్నాటక గండం గట్టెకించింది. దక్షిణాది ట్రబుల్ షూటర్, పార్టీ వీర విధేయుడు డీ.కే. శివకుమార్‌కు సీ.ఎం. పగ్గాలు అప్పగించింది.

**కేరళలో., కన్నడ తరహాలో సతీషన్‌కు అవకాశం :-**

ఇటీవల కేరళ ఎన్నికల్లో విజయానికి కారణమైన వీ.డీ. సతీషన్‌ను, కాంగ్రెస్ అధిష్ఠానం .. స్థానిక సమీకరణలు చక్క దిద్ది, సీఎం పదవి కట్టబెట్టింది. తమిళనాడులో జెన్-జెడ్ ఫార్ములాతో విజయం సాధించిన టీవికే పార్టీ అధినేత దళపతి విజయ్‌తో జతకట్టి అర్థ శతాబ్దం తరువాత తమిళ ప్రభుత్వంలో భాగస్వామి అయింది. 2029 ఎన్నికల నాటికి జాతీయ స్థాయిలో బలపడేందుకు ఇవన్నీ కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా వేస్తున్న అడుగులే. కేరళ రాజకీయాలను ఓ దశాబ్దంగా జల్లెడ పట్టిన కాంగ్రెస్ అధిష్ఠానం అక్కడి ఎల్.డీ. ఎఫ్. కూటమితో మైత్రి బంధం కొనసాగిస్తూనే, తనంతటకు తాను స్వతంత్రంగా బలపడే వ్యూహాన్ని రూపొందించి క్షేత్ర స్థాయిలో అమలు పర్చింది. కాంగ్రెస్‌లో పాత తరం నాయకులను అవసరానికే పరిమితం చేస్తూ.. యువనాయకత్వానికి కర్నాటక,తెలంగాణా తరహాలో అవకాశ మిచ్చి పూర్తి స్థాయిలో ప్రోత్సహించింది. యువనేత సతీషన్‌కు కేరళ పీసీసీ పగ్గాలు అప్పగించి, ప్రజాక్షేత్రంలో 10 ఏళ్ల పాటు ఎల్.డీ.ఎఫ్.ను ఎదుర్కొనేలా చేసింది. చివరికు విజయం సాధించడం ద్వారా లక్ష్యానికి చేరుకుంది. ఇస్త్రీ మడతలు నలగని పెద్దతరం ఖద్దరు మార్కు రాజకీయాల నుంచి, పార్టీ పగ్గాలు యువతరం చేతికి మారడంతో .. కేరళలో కాంగ్రెస్ గెలుపు సులువైంది. సీఎం అభ్యర్థి ఎంపిక ఓ పక్షం రోజులు ఆలస్యమైనా,పార్టీలోని అన్ని వర్గాలను ఒప్పించి ఏకతాటిపై తెచ్చింది. పార్టీ విజయబావుటాకు కారణమైన యువశక్తికి సారథ్యం వహించిన వీడీ. సతీషన్‌కు సీఎం పగ్గాలు అప్పగించి..సమర్థ రాజకీయాల దిశగా యువతను ప్రోత్సహించింది.

**డికే. శివకుమార్ సమర్థత,నిబద్ధతకు అధిష్ఠానం ఫిదా:-**

అధికార మర్పిడి విషయంలో అనేక మలుపులు తిరిగిన కర్నాటక రాజకీయాలను కాంగ్రెస్ అధిష్ఠానం కట్టడి చేయగలిగింది. అక్కడ కాంగ్రెస్ విజయానికి అత్యంత కీలకంగా వ్యవహరించిన డీకే శివకుమార్ చేతికి సీఎం పగ్గాలు అప్పగించింది. బలమైన సామాజిక వర్గానికి ప్రతినిధిగా ఉన్న సిద్ధ రామయ్యను సునాయాసంగా రాజీనామా చేయించడం ద్వారా లింగాయత్,ఒక్కలింగ సామాజికి వర్గాల మధ్య సమతుల్యత సాధించింది. వ్యవస్థల విధ్వంసంతో తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగిన కమలం పార్టీకి జాతీయ స్థాయిలో దీటుగా ఎదుర్కొనే సామర్థం కల నాయకుడిగా డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం అంచనా వేస్తోంది. గతంలో పలు సందర్భాల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాలు సమస్యల చట్రంలో ఇరుకున్నప్పుడు ట్రబుల్ షూటర్‌గా ఆయన్ను పంపింది. 2002లో మహారాష్ట్ర విలాస్‌రావుదేశ్‌ముఖ్ ప్రభుత్వం సంక్షోభంలో పడకుండా ఆయన అధిష్టానం దూతగా గట్టెక్కించారు. అక్కడి 40 మంది ఎమ్మెల్యేలను కేంద్ర నిఘా సంస్థల కళ్లు గప్పి రోడ్డుమార్గం ద్వారా కర్నాటకకు తరలించి పెనుముప్పును నిలువరించారు. 2017 లో గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్‌ను గట్టెక్కించేందుకు ఆయన పూర్తి స్థాయి శక్తియుక్తులను వెచ్చించి అధిష్ఠానం మన్నలను పొందారు. ఐడీ,ఈడీ వంటి దాడులు జరిగినా ఏ మాత్రం లెక్కచేయక.. జైలు బాటను ఎంచుకొని అధిష్ఠానం మెప్పు పొందారు.

**కాంగ్రెస్ పునర్జీవనానికి అధిష్ఠానం వ్యూహం :-**

ఇటీవల ఎన్నికల్లో తమిళనాట టీవీకే పార్టీకి, సంపూర్ణ మద్దతు ప్రకటించడం కూడా.. కాంగ్రెస్‌లో ముందస్తు వ్యూహంలో ఓ భాగమే. యువతరం ఆశలకు ప్రతిరూపంగా గెలిచిన దళపతి విజయ్, రాజకీయ హైజాక్‌కు గురికాకుండా నిలువరించ గలిగింది. అప్పటి వరకు అక్కడ అధికార పార్టీ డీ.ఎం.కే.తో పొత్తు తెగతెంపులు చేసుకొని, టివీకేను సమర్థించడం దక్షిణాదిని, విద్వేష రాజకీయాల బారిన పడకుండా కాపాడేందుకే. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కేరళ, కర్నాటక రాష్ట్రాలు, అధికారం పంచుకుంటున్న తమిళనాడు రాష్ట్రంలో.. అమలు జరుపుతున్న ఫార్ములానే కాంగ్రెస్ తెలంగాణా,ఆంధ్రా రాష్ట్రాల్లో అమలు పరుస్తూ వస్తోంది. అడ్డగోలు విభజనతో ఏర్పడ్డ ఆంధ్రా,తెలంగాణా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కుదేలవడంతో ., తెలంగాణాలో పార్టీకి జీవం పోసేందుకు యువతరం నేత రేవంత్ రెడ్డికి పీసీసీ పగ్గాలు అప్పగించడం ద్వారా అక్కడ పార్టీని తిరిగి అధికారంలోకి తేగలిందిం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల నుంచి అనేక ఒత్తిడిలు ఎదురైనప్పటికీ.. వాటన్నింటినీ అధిగమించి.. కర్నాటక,కేరళ తరహాలో కాంగ్రెస్ పునర్జీవనానికి కారణమైన రేవంత్ రెడ్డికి తెలంగాణా సీఎం పగ్గాలు అప్పగించింది. ఆదినుంచి అక్కడి కాంగ్రెస్‌లో పార్టీ బలోపేతం కంటే గ్రూపు గొడవలదే పై చేయి. ఆ గొడవల ప్రభావం రేవంత్ రెడ్డి పాలనా వ్యవహారాలపై పడకుండా అధిష్ఠానం అన్నింటా రేవంత్‌ను సమర్థిస్తూ బలమైన యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తోంది.

**ముందస్తు వ్యూహంతో షర్మిలకు పీసీసీ పగ్గాలు:-**

రాష్ట్ర విభజన అనంతరం.. ఆంధ్రాలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుకు కీలక పాత్ర పోషించిన, కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి తనయ.. వైఎస్ షర్మిలను కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా అక్కున చేర్చుకుంది. ఆంధ్ర రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలిని చేసి పార్టీ బలోపేతం చేసే బాధ్యతను అప్ప గించింది. అప్పట్లో ఆమె నడుపుతున్న తెలంగాణా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని, కాంగ్రెస్‌లో విలీనం చేసే క్రమంలో కర్నాటక డిప్యూటీ సీఎం హెూదాలో డీ.కే శివకుమార్, తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డిలు తెరవెనుక బలమైన పాత్ర పోషించారు. ఆ నేపథ్యంలో చోటు చేసుకున్న రాజకీయ సమీకరణలే వైఎస్ రాజ శేఖర్ రెడ్డి ఆకస్మిక మరణం అనంతరం, ఏర్పడ్డ వైసీపీ పార్టీ.. 2024 ఎన్నికల్లో ఓటమి పాలు కావడానికి ప్రధాన కారణమయ్యాయి. తాజాగా కర్నాటకలో అధికార మార్పిడి రాజకీయంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్న సందర్భంలోనే ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల్లో సరికొత్త కదలికలు మొదలయ్యాయి. పీసీసీ చీఫ్‌గా ఉన్న వైఎస్ షర్మిల, అధిష్ఠానం పిలుపు మేరకు హుటాహుటిన ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. షర్మిలకు కర్నాటకనుంచి రాజ్యసభ సభ్యత్వం లభించనుందనే ప్రచారం జోరుగా జరుగుతోంది. మరో వైపు ఎపి కాంగ్రెస్‌లో షర్మిల వ్యవహార శైలిని వ్యతిరేకించే వారూ లేక పోలేదు.

**షర్మిల వ్యవహార శైలిపై ఏపీ కాంగ్రెస్‌లో విమర్శలు:-**

పిసీసీ అధినేతగా షర్మిల పనితీరు నామమాత్రమనే విమర్శలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. పార్టీ బలోపేతం కంటే వ్యక్తిగత విమర్శలకే ఆమె ప్రాధాన్యత ఇస్తు న్నారనే అభిప్రాయం కొందరిలో ఉంది. ఆమెను రాజ్యసభకు పంపడం కూడా అధిష్ఠానం వ్యూహమని, తద్వారా ఏపీకి సరికొత్త .. సమర్ధ సారథి రావచ్చని ఇంకొందరు ప్రచారం చేస్తున్నారు. ఆ విమర్శలు ఎలా ఉన్నా ఏపీలోని ఇతర పార్టీల హై కమాండ్‌లకంటే .. పీసీసీ చీఫ్ హెూదాలో షర్మిల కేంద్రంలోని ఎన్డీఏ సర్కారును దుయ్యబట్టే క్రమంలో ఏ మాత్రం వెనుకాడటం లేదు. కేంద్ర సర్కార్ విధివిధానాలపై తరుచూ ఆమె నిప్పులు చెరుగుతున్నారు. నిన్న మొన్నటి నీట్ వైఫల్యం వరకు తనదైన శైలిలో ఎండగుడుతూనే ఉన్నారు. పదునైన పదాలతో ఆమె సంధించే వాగ్బాణాలు.. మీడియా అటెన్షన్‌తో పాటు, జనం ఆలో చన లకు పదును పెడుతున్నాయి. మరో విధంగా చెప్పాలంటే షర్మిలను కాంగ్రెస్‌కు చేరువ చేసిన.. డీ.కే.శివకుమార్,తెలంగాణా సీఎం.రేవంత్ రెడ్డిల ప్రోత్సా హం, ప్రోద్బలం షర్మిలకు మెండుగా ఉంది. ముగ్గురు నేతల మధ్య స్పష్టమైన రాజకీయ అవగాహన, అదే స్థాయి సారూప్యతలు ఉన్నాయి. షర్మిలకు పీసీసీ అధ్యక్షురాలిగా కొనసాగిస్తూనే, అదనపు బలం కల్పించే విధంగా రాజ్య సభ సభ్యత్వం ఇవ్వాలన్నది, ఏతా వాతా అధిష్ఠానం యోచనలా ఉంది. మరో వైపు దక్షిణాది కాంగ్రెస్ రాష్ట్రాల సీఎంలు.. మైత్రీ బంధంలో ఉన్న తమిళనాడు సీఎం సహకారంతో 2029 ఎన్నికల్లో.. ఏపీలో కాంగ్రెస్ విజయకేతనం ఎగుర వేయాలన్నది స్పష్టమైన వ్యూహంగా కనబడుతోంది. అందుకు దక్షిణాది రాష్ట్రాల ఊతం ఆధారంగానే , జాతీయంగా కాంగ్రెస్ పునర్జీవనానికి బాటలు వేయలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు అన్నింటా వైఫల్యాలు వెక్కిరిస్తున్న దశలో, దేశ ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను నిలపాలని., అందుకు దక్షిణాది పట్టుతోనే ఉత్తరాదికి పార్టీని విస్తరింప చేసి .. కేంద్రంలో అధికార పీఠానికి చేరువ కావాలని అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది.

---

(మొదటిపేజీ తరువాయి)

# సిద్ధరామయ్య రాజీనామా ఆమోదం

ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్‌కు అందజేసిన విషయం తెలిసిందే. అనంతరం అర్ధరాత్రి బెంగళూరుకు చేరుకున్న గవర్నర్ శుక్రవారం ఉదయం అధికారికంగా సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించారు. అదే సమయంలో సిద్ధరామయ్య నేతృత్వంలోని మంత్రివర్గాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్టు గవర్నర్ లోక్‌భవన్ నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు సిద్ధరామయ్య తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగుతారని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ అగ్రనాయకులతో సిద్ధరామయ్య భేటీ**

పలువురు సీనియర్ నేతలతో కలిసి ఢిల్లీకి వెళ్లిన సిద్ధరామయ్య శుక్రవారం కాంగ్రెస్ అగ్రనాయకులతో భేటీ అయ్యారు. మల్లికార్జున ఖర్గేను సిద్ధరామయ్య కలవగా, రాహుల్ గాంధీ, ఖర్గేలను డీకే శివకుమార్ కలిశారు. అనంతరం కర్నాటక తదుపరి ముఖ్యమంత్రి ఎంపికతో పాటు కొత్త మంత్రివర్గ కూర్పుపై చర్చలు జరిగినట్టు సమాచారం. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అదే విధంగా ఈ సమావేశంలో రాజ్యసభ ఎన్నికల అభ్యర్థులు, ఎమ్మెల్సీ స్థానాలకు పేర్లు ఖరారు చేయడంతో పాటు కొత్త మంత్రివర్గ ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు వెల్లడించాయి.

**నలుగురు ఉప ముఖ్యమంత్రుల నియామకం!**

సిద్ధరామయ్య క్యాబినెట్‌లో ఉన్న పలువురు మంత్రులకు డీకే శివకుమార్ నేతృత్వంలోని కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వంలో సామాజిక, ప్రాంతీయ సమతుల్యతను కాపాడేందుకు నలుగురు ఉప ముఖ్యమంత్రులను నియమించవచ్చని పార్టీ వర్గాలు సూచించాయని సమాచారం. అలాగే సిద్ధరామయ్య రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తున్నామనే సంకేతం ఇచ్చేలా ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్రకు క్యాబినెట్‌లో చోటు కల్పించి కీలక శాఖ అప్పగించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం (సీఎల్పీ)ను శనివారం ఖరారు చేసినట్టు తెలిసింది. అనంతరం డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశమున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కర్నాటకలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ రెండు స్థానాలను సులభంగా గెలుచుకునే స్థితిలో ఉండగా, మూడో స్థానంపైనా ఆధిక్యం సాధించే అవకాశమున్నట్టు సమాచారం. మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల ప్యానెల్‌ను రణదీప్ సుర్జేవాలా అధిష్ఠానానికి సమర్పించనుండగా, మల్లికార్జున ఖర్గేను మళ్లీ రాజ్యసభకు పంపే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అలాగే రాష్ట్రంలోని ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి సంభావ్య అభ్యర్థుల జాబితాను కూడా పార్టీ అధిష్ఠానానికి అందించనున్నారు.

**జైపూర్‌లో సిద్ధరామయ్య**

డీకే శివకుమార్ గురువారం అర్ధరాత్రి ఢిల్లీలోని చాణక్యపురిలో ఉన్న కర్నాటక భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, " ఈరోజు వాతావరణం బాగా లేదు. మా సీఎం జైపూర్‌లో దిగారు. తీవ్ర గాలివానల వల్ల విమాన ప్రయాణంలో తీవ్ర అంతరాయం ఏర్పడింది" అని అన్నారు. మరోవైపు జైపూర్‌లో రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్, సిద్ధ రామయ్య, రణదీప్ సుర్జేవాలాలను విమానాశ్రయంలో కలిశారు.

# నీట్ లీక్‌పై నిలదీత

**- ఎన్‌టీఏకు సుప్రీం ప్రశ్నలు**
**- లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందే**
**- ఇలాంటి ఘటనలు విద్యార్థులు, తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభ**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తాజాగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)పై పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, పర్యవేక్షణ కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. ఇలాంటి ఘటనలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభ కలిగిస్తుందని పేర్కొంది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటివరకు అసలు సమస్య ఆగదని అసహనం వ్యక్తం చేసింది. సివిల్స్ పరీక్షలు నిర్వహించే యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. కోర్టు విచారణకు ఎన్‌టీఏ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు ఏర్పాటైన హైలెవెల్ కమిటీ చైర్మెన్ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు దాఖలు చేసిన అఫిడవిట్‌లను ధర్మాసనం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసేందుకు ఆరు వారాల అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్ నరసింహ స్పందిస్తూ అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని రాధాకృష్ణన్‌ను ప్రశ్నించారు. ఇందుకు రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య తలెత్తిందని, ప్రస్తుతం ఆ లోపాలనూ సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామన్నారు. మరోసారి ఇలాంటివి జరగవని, సంస్కరణలే తమ లక్ష్యమని వెల్లడించారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది.

ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందన్నారు. జూన్ 21న నిర్వహించనున్న పరీక్ష కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని, ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని, ప్రధానమంత్రి స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

# ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ

**- చర్లపల్లి జైలుకు తరలింపు**
**- మూడు రోజుల పోలీసు విచారణ**

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను పోలీసులు మూడో రోజు విచారణ చేశారు. పేట్బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అతడిని పలు ప్రశ్నలు అడిగారు. శుక్రవారంతో భగీరథ్ మూడు రోజుల పోలీస్ కస్టడీ ముగిసింది. ఈ నేపథ్యంలో నిందితుడిని మల్కాజ్గిరి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు.

**ఇన్స్టా, వాట్సాప్ చాటింగ్ ఆధారంగా**

విచారణలో పోలీసులు ప్రధానంగా బాధితురాలితో సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ అయిన ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించిన వాటిపై ప్రశ్నించినట్టు సమాచారం. ఇందులో ఇప్పటికే కొన్ని ఆధారాలను సేకరించారు. వాటి ఆధారంగానే బండి భగీరథ్‌ను లోతుగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తు అధికారి డీసీపీ రితిరాజ్, పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ ఆధ్వర్యంలో(పోలీసు కస్టడీ) నిందితుడి పోలీసు విచారణను పూర్తి చేశారు.

**విచారణలో భాగంగా సీన్ రీకన్స్ట్రక్షన్**

మే 16వ తేదీన పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు మే 27వ తేదీన చర్లపల్లి జైలు నుంచి కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజుల విచారణలో భాగంగా తొలిరోజు క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌లోని అనన్య ఫామ్ హౌస్కు తీసుకెళ్లారు. నిందితుడు అక్కడ తనను వేధించినట్లు బాధితురాలు ఫిర్యాదు పేర్కొన్న నేపథ్యంలో ఆ రోజు ఏం జరిగిందో వివరాలన్నీ తాజాగా భగీరథ్ నుంచి కూడా సేకరించారు. దాదాపు గంటపాటు ఫామ్‌హౌస్‌లో విచారణ చేసిన పోలీసులు కొన్ని కీలక వివరాలు రాబట్టారు. అనంతరం బాలానగర్‌లోని కూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తీసుకు వెళ్లి విచారణ చేశారు.రెండోరోజు కూడా భగీరథ్ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలపై ప్రశ్నించారు. బాధితురాలితో గతంలో చేసిన చాటింగ్ గురించి ప్రధానంగా ప్రశ్నించినట్టు సమాచారం. వాట్సప్, ఇన్స్టాగ్రామ్, స్నాప్చాట్లో చేసిన చాటింగ్ గురించి ఆరా తీశారు. బాధితురాలు, ఆమె తల్లి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అనుబంధ ప్రశ్నలు వేశారు. మరోవైపు దర్యాప్తులో భాగంగా పోలీసులు గతంలో బాధితురాలితో తిరిగిన ప్రదేశాల పుటేజ్, కాల్ డేటా ఆధారాలను సేకరించారు.

# జూన్ 3న డీకే శివకుమార్ సీఎంగా ప్రమాణస్వీకారం

**బెంగళూరు - సూర్య వాస్తవం**

కాంగ్రెస్ అధిష్టానం సూచనతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం సాయంత్రం సీఎం పదవీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. డీకే శివకుమార్ నాయకత్వంలో కొత్త మంత్రివర్గం ఏర్పాటు కానుంది. అదే విధంగా ఆయన ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారు అయింది. జూన్ 3న ఆ రాష్ట్ర 25వ ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార వేడుకను బెంగళూరులో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ శ్రేణులు భారీగా తరలిరానున్నాయి. పార్టీ సీనియర్ నేతలతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ఈ వేడుకకు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యే అవకాశం ఉంది.

# డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

సమీక్షలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో సైబర్ నేరాలను సమూలంగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించిన కార్యాచరణను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఆరు స్తంభాల (6 పిల్లర్స్) ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్‌బోర్డ్, టెక్నాలజీ-ఏఐ వినియోగం, పోలీసులకు శిక్షణ, 3-టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటివి ఉంటాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో అత్యాధునిక సదుపాయాలతో రాష్ట్రస్థాయి సైబర్ వార్ రూం ఏర్పాటు చేస్తున్నామని, ఇది 30 రోజుల్లో అందుబాటులోకి వస్తుందని డీజీపీ తెలిపారు. సైబర్ మోసంపై ఫిర్యాదు అందిన వెంటనే 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, గోల్డెన్ అవర్ టైంలో స్పందించి బాధితుల డబ్బు బదిలీ కాకుండా చూడాలని సీఎం సూచించారు. ఇందుకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

పోలీసు పెట్రోలింగ్ తరహాలోనే 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిరంతరం జరగాలని చంద్రబాబు అన్నారు. నేరం జరగకముందే ప్రజలను అప్రమత్తం చేయడంపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి వీబశ్రీవఎబత్వతీ౼ూ× వంటి టెక్నాలజీలను వాడతామని, ఏడాదిలో 500 మంది పోలీసు అధికారులకు శిక్షణ ఇస్తామని డీజీపీ వివరించారు. 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు, 4 ప్రాంతీయ హబ్‌లు ఏర్పాటు చేసి నేరాలకు అడ్డుకట్ట వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ప్రాజెక్టుల పూర్తికి గడువు విధించండి: సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని, వాటి పూర్తికి కచ్చితమైన కాలపరిమితి నిర్దేశించుకుని పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్టీసీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులతో పాటు దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల పనులపైనా చర్చించారు. "ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవ తేదీలు ప్రకటించాం. పెద్ద పరిశ్రమలను 18 నెలల్లోగా ఉత్పత్తి ప్రారంభించాలని చెబుతున్నాం. అదే తరహాలో ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను పూర్తి చేయాలి. దశాబ్దాల తరబడి జాప్యం చేయడం సరైన విధానం కాదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల సమీకరణ, టెండర్ల ప్రక్రియ వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆర్టీసీపై జరిగిన సమీక్షలో, సంస్థ ఆస్తులను సద్వినియోగం చేసుకుని, బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈవీ బస్సుల కొనుగోళ్లపై కూడా అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సర్‌తో అందరికీ సమస్యే

**- లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు నష్టం**
**- సర్ తో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలి**
**- దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం : సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

ప్రత్యేక విస్తృత సవరణ (సర్ )తో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య అని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, పీసీసీ అడ్వైజరీ కమిటీ ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ పైన అందరు అవగహన పెంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామమని అభినందించారు. సర్ లంబాడీ లు ,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజలు పెద్ద ఎత్తున వలస పోయారనీ, అలాంటి వారితో పాటు మహిళలకు కూడా సర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చని చెప్పారు. సర్ కారణంగా దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదముందని అప్రమత్తం చేశారు. సర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బూత్ ఎన్ రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించామనీ, ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీ తో సన్మానం చేయించామని ఆయన గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్ రోలర్స్ ను స ర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. డిజిటట్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇన్ చార్జ్‌ని నియమించి నిరంతరం పర్యవేక్షించామని తెలిపారు. సర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇన్ చార్జ్‌లను నియమించాలనీ, అసెంబ్లీ ఇన్ చార్జ్‌లు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని దిశా నిర్దేశం చేశారు. ఇన్ చార్జ్‌లు సరిగ్గా పని చేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా అడ్డుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. ఇన్ చార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలనీ, క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తాననీ, నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తానని తెలిపారు. తనతో పాటు ఎవరికి మినహాయింపు ఇవ్వొద్దనీ, పార్టీ కోసం అందరూ పని చేయాల్సిందనని తేల్చి చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లతో సహా ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచ నలు తీసుకోవాలని కోరారు. దాదాపు గా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామనీ, పార్టీ తరుపున ప్రస్తుతం వేలాది మంది సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా పార్టీ నాయకులంతా సమన్వయం తో జాగ్రత్త పడాలని కోరారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలనీ, నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో సర్ పైన అసెంబ్లీల వారీగా సమా వేశాలు పెట్టాలని సూచించారు. సర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీ గా సమావేశాలు నిర్వహించాలన్నారు.

**పీసీసీ అధ్యక్ష?ుడి ఆదేశాలను అందరం పాటించాల్సిందే..**

వారానికి ఒక రోజు మంత్రులు పార్టీ పనులపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. తాను కూడా వారానికి ఒక రోజు పీసీసీ అధ్యక్ష?ుడు కేటాయించిన నియోజకవర్గంలో పాల్గొంటానని తెలిపారు. పార్టీ నిర్మాణంలో ప్రతిష్టపరచడంలో భాగస్వాములు కావాలన్నారు. పీసీసీ అధ్యక్ష?ుల ఆదేశాలను అందరం పాటించాలని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు చేస్తున్న పనులపై మీనాక్ష? నటరాజన్ సమీక్ష?ంచాలని కోరారు. ?దాదాపు గా నామినేటేడ్ పోస్టులను భర్తీ చేశామనీ, పార్టీ తరుపున ప్రస్తుతం వేలాది మంది సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా పార్టీ నాయకులంతా సమన్వయం తో జాగ్రత్త పడాలని కోరారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలనీ, నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నారు. శని వారం నుంచి మంత్రులకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులకు టీపీసీసీ అధ్యక్ష?ులు నియోజకవర్గాలను కేటాయించనున్నారు. ఈ సమా వేశంలో పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్యరహితంగా పుష్కరాలు

**కార్యాచరణ ప్రణాళిక ప్రకటించిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్**

**అమరావతి - సూర్య వాస్తవం**

గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' పేరిట సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీలను గుర్తించి, వాటిని మురుగు రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. గోదావరిలో మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, ఆక్వా కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు శుక్రవారం ప్రకటించిన కార్యాచరణలో పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 8.38 మిలియన్ లీటర్ల మురుగునీరు గోదావరిలో కలుస్తున్నట్లు గుర్తించగా, దీని నివారణకు బిబి గ్రామ్ జి పథకంలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలని నిర్ణయించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పరిశీలనలో గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల మున్సిపాలిటీల నుంచి రోజుకు 104 మిలియన్ లీటర్ల మురుగునీరు గోదావరిలో కలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మరో 8.38 మిలియన్ లీటర్లు, ఆక్వా రంగం నుంచి 13.24 మిలియన్ లీటర్లు విడుదలవుతోందని గుర్తించినట్లు వెల్లడించారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఒక్క ఆంధ్ర పేపర్స్ నుంచే రోజుకు 32 మిలియన్ లీటర్ల వరకు జలాలు విడుదలవుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పారిశ్రామిక కాలుష్య నియంత్రణకు నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ప్రతి మున్సిపాలిటీ సామర్థ్యానికి అనుగుణంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టిపిలు) నిర్మించాలని ఆదేశించారు. గోదావరి కాలుష్య నియంత్రణ కోసం ఆర్‌టిజిఎస్ తరహాలో ప్రత్యేక



కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రాంతాలవారీ సిసి కెమెరాలు, స్క్రీన్లు ఏర్పాటుచేసి ఎక్కడైనా మురుగు నేరుగా గోదావరిలోకి విడుదల వుతుందా అనే అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

## కనంపల్లెలో 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమం

**- సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య**



**పులివెందుల రూరల్– సూర్య వాస్తవం :** పులివెందుల మండల పరిధి లోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కనంపల్లె గ్రామంలో శుక్రవారం నాడు 'ఫ్రైడే – డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ, వర్షాకాలం మరియు శీతాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రమాదకర జ్వరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరాలు వాడాలి అని సూచించారు.

**కార్యక్రమంలో భాగంగా చేపట్టిన చర్యలు:**

**అవగాహన ర్యాలీ:** గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బ్యానర్లతో ప్రజలకు అవగాహన కల్పించారు.

**నీటి నిల్వల తనిఖీ:** ఇళ్లలోని ఎయిర్ కూలర్లు, సిమెంట్ తొట్లు, పాత డ్రమ్ములు మరియు కుండలలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి, వాటిని శుభ్రం చేయించారు.

**యాంటీ లార్వా ఆపరేషన్:** గ్రామంలో నిల్వ ఉన్న మురుగునీటి గుంతలలో దోమల నివారణకు గానూ ఆబెట్ పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోపాల్ నాయక్, లక్ష్మి భార్గవి, ఆశా కార్యకర్త అంజనమ్మ మరియు స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు వెంకన్న ఆలయంలో పౌర్ణమి విశేష పూజలు



**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణ పరిధిలోని నడిబొడ్డున కొలువై ఉన్న శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకట రమణ స్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వహకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పత్రిక భాగంగా వారు తెలియజేస్తూపులివెందుల శ్రీవారి భక్తులకు తెలియ చేయడం ఏమనగా 30.5.26 శనివారం పౌర్ణమి పురస్కరించుకొని రాత్రి 8.30 గంటలకు స్వామివారి ఏకాంత సేవనేతిదీపాలంకారములతో అత్యంత శోభాయ మానంగా స్వామివారి పూజలు నిర్వహించడం జరుగుతుందని కావున భక్తుల స్వామివారిని దర్శించుకుని ఏకాంత సేవ, ప్రసాదము(పాలు.పండ్లు.క్షీరాన్నము.)స్వీకరించాలన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## మహనీయులను స్మరించండి

**- మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించకండి**

**- వైకాపా పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి**



**పులివెందుల - సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావును స్మరించుకోవాల్సిన ఎంతైనా ఉన్నదని అదే విధంగానే కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించకుండా విధిగా అమలు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి కలదని పులివెందుల వైకాపా పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని తెదేపా శ్రేణులు హైబ్రిడ్ మహానాడు పేరుతో కార్యక్రమాలు నిర్వహించి మహనీయుని స్మరించుకోవడం మంచి పరిణామమేనని అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అలసత్వం దేనికో వారికే తెలియాలని ఓట్లు వేయించుకొని అవసరం తీరాక హామీలను గాలికి వదిలేసారని, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారని, జాబ్ క్యాలెండర్ విడుదల, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగా చేశారని, 18 ఏళ్ల నుండి 59 ఏళ్ల వయసు వరకు మహిళలకు నెలకు 1500 ఇస్తామని చెప్పిన ఆడబిడ్డ నిధి అమలు కాలేదని, చిన్న చిన్న కారణాలతో తల్లికి వందనం పథకాన్ని ప్రజలకు దూరం చేస్తున్నారని, హామీలను మరిచే చరిత్రను చంద్రబాబు నాయుడు పునరావృతం చేస్తున్నారని, మహానాడు పేరుతో భారీ వేదికలు వర్చువల్ సమావేశాలు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యలు మరియు ఎన్నికల హామీలు అభివృద్ధి అంశాలపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరమని ఇప్పటికైనా ఆర్భాటాలు మాని ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై, రాష్ట్ర అభివృద్ధి,సంపద సృష్టిపై దృష్టి సారించాలని గంగాధర్ రెడ్డి హితవు పలికారు.

## తెలుగు భాష విషయంలో టీడీపీ, వైసీపీ దొందూ దొందే

- జగన్, చంద్రబాబు ఇద్దరూ తెలుగు భాష విధ్వంసకులే.
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** తెలుగు భాషను నాశనం చేయడంలో టిడిపి,వైకాపా పార్టీలు దొందూ దొందే అని, అటు జగన్,ఇటు చంద్రబాబు ఇద్దరు కూడా తెలుగు భాష విధ్వంసకులేనని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాల వరకు తెలుగు భాష ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడే భాషల్లో ఐదవ స్థానంలో ఉండేదని,ప్రస్తుతం ఏడవ స్థాయికి దిగజారిందని తులసి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 2500 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం కలిగిన అతి ప్రాచీనమైన భాష తెలుగు భాష అన్నారు. తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అనే ఒక విదేశీయుడైన నికోలాస్ కాంటి ప్రస్థుతించాడు. తెలుగు భాషను సుందర తెలుంగు అని ప్రఖ్యాత తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి కీర్తించాడు. దేశభాషలందు తెలుగు లెస్స అనే సాహితీ సమరాంగన సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు ప్రశంసించాడు .

తెలుగు భాష మధురమైన భాష. తెలుగు భాషా వైభవాన్ని,ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేయడానికి స్వర్గీయ ఎన్టీఆర్ చేసిన కృషి మరువలేనిది. తెలుగు భాష, సాహిత్యం, లలిత కళలు, జానపద విజ్ఞానములో పరిశోధనలు, ప్రత్యేక కోర్సుల కోసం 1985లో స్వర్గీయ ఎన్టీఆర్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. అధికార భాషగా తెలుగును ఎన్టీఆర్ సమర్ధవంతంగా అమలు చేశారు. హైదరాబాదులో ట్యాంక్ బండ్‌పై తెలుగు భాష,సాహిత్యం,సాంస్కృతిక రంగాలకు విశేష సేవలందించిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ తన జీవితాంతం తెలుగు భాషాభివృద్ధి కోసం మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా కృషి చేశారు. రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆంధ్రప్రదేశ్లో తెలుగు భాష రోజు రోజుకు తన ప్రతిష్టను,విశిష్టతను కోల్పోతూ ఉంది. ఆంధ్ర ప్రదేశ్ లో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైకాపా ప్రభుత్వం జీవో 85 జారీ చేసింది, ఇది ఒక చారిత్రాత్మక తప్పిదం.

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆ జీవోను కొనసాగిస్తూ ఉండడం మరో చారిత్రిక తప్పిదం.

ఈ జీవో కారణంగా 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 95 శాతం మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాశారు. మిగతా ఐదు శాతం లో తమిళ్, కన్నడ, ఒరియా, ఉర్దూ సంస్కృతం, తెలుగు మాధ్యమ విద్యార్థులు ఉన్నారు.

దీనిని బట్టి ఆంధ్రప్రదేశ్లో తెలుగు భాష దుస్థితి స్పష్టమవుతుంది. ఇది ఇలాగే కొనసాగితే అచిర కాలములో ఆంధ్రప్రదేశ్లో తెలుగు భాష చదివే వారు ఉండరు, రాసే వారు ఉండరు, మాట్లాడే వారు ఉండరు. తెలుగు భాష కాలగర్భంలో కలిసిపోతుంది. తెలుగు జాతి అంతరించిపోతుంది. స్వర్గీయ ఎన్టీఆర్ పట్ల,తెలుగు భాష పట్ల,తెలుగుజాతి పట్ల చంద్రబాబు ప్రభుత్వానికి ఏమాత్రం గౌరవం, అభిమానం ఉన్నా జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 85ను రద్దు చేయాలి. పాఠశాల విద్యలో లేదా కనీసం ప్రాథమిక విద్యలో అటు ప్రభుత్వ పాఠశాలల్లో,ఇటు ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్యా ప్రవేశాలలో, ఉద్యోగాలలో రెండు శాతం అదనపు మార్కులు కలపాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు,చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పసుపు పండుగ నిర్వహణ

- చరిత్ర సృష్టించేది తెదేపానే : మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు
- హైబ్రిడ్ మహానాడును విజయవంతం చేసిన పసుపుదళం
- కనీవినీ ఎరుగని రీతిలో మహానాడుకు హాజరైన కార్యకర్తలు
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించేందుకు కార్యకర్తలు నేతలు సిద్ధమయ్యేలా ఊతమిచ్చిన హైబ్రిడ్ మహానాడు
- మహిళా శక్తి, కార్యకర్తలే సుప్రీం అన్న మహానాడు తీర్మానం
- మహానాడులో కదం తొక్కిన జెన్ జి యువత
- మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు



**శాంతీపురం - సూర్య వాస్తవం :** రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో రంగ రంగ వైభవంగా రెండు రోజులపాటు తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు కార్యక్రమం కొనసాగిందని మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మహానాడు వేదికపై నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు చేసిన ప్రసంగం టిడిపి క్యాడర్ కు ప్రజాసేవకోసం మార్గదర్శకంగా నిలిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు అత్యంత ఘనంగా జరిగిన మహానాడు కార్యక్రమం ప్రశాంతంగా, క్రమశిక్షణతో కొనసాగిందన్నారు. స్త్రీ శక్తి, కార్య కర్తలే అధినేత అనే నినాదాలు ప్రస్ఫుటించేలా మహానాడు జరిగిందన్నారు. రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం తెలుగుదేశం పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు. మహానాడు హైబ్రిడ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్లతో పాటు 12 దేశాల నుంచి కార్యకర్తలు నేతలు హాజరయ్యారన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,875 డిజిటల్ క్లస్టర్ల ద్వారా సుమారు 24.5 లక్షల మంది కార్యకర్తలు, నాయకులు ఈ పండుగలో ప్రత్యక్షంగా భాగస్వాముల య్యారన్నారు. భౌగోళిక సరిహద్దులను చెరిపివేస్తూ సాగిన ఈ ప్రయోగం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందన్నారు. సాధారణంగా ఒక బహిరంగ సభను భారీ స్థాయిలో నిర్వహిస్తే ట్రాన్స్పోర్ట్, భోజనాలు, ఇతర సౌకర్యాల కోసం కోట్ల రూపాయల ఖర్చు అవుతుందన్నారు. ముఖ్యంగా ఇంధన ధరల పెరుగుదల, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులతో చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం ఒక మాస్టర్ స్ట్రోక్ ' అని చెప్పాలన్నారు. ఖర్చును గణనీయంగా తగ్గించడమే కాకుండా, కార్యకర్తలకు వారి సొంత నియోజకవర్గాల్లోనే పండుగ వాతావరణం కల్పించడంలో ఈ విధానం విజయవంతం అయిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి అత్యంత భారీ విజయాన్ని చేకూర్చేందుకు ఈ హైబ్రిడ్ మహానాడు ఉపయోగపడుతుందని అన్నారు. ఇలాంటి వినూత్న ఆలోచనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లే నిదర్శనమని కొనియాడారు. ఈ హైబ్రిడ్ మహానాడులో జెన్జీ యువత కదం తొక్కిందని కొనియాడారు. పార్టీ కోసం ప్రాణాలు ఇచ్చే కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో ఉండడమే అసలు విజయమని తెలిపారు.ఈ రెండు రోజులపాటు మహానాడుని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ యంత్రాంగానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

**- టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి**



**పులివెందుల - సూర్య వాస్తవం :** రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో రంగ రంగ వైభవంగా రెండు రోజులపాటు తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు కార్యక్రమం కొనసాగిందని, మహానాడు విజయవంతానికి కార్యకర్తలు నాయకులు పార్టీ శ్రేణులు ప్రధాన కారణమని పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మహానాడు వేదికపై నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ లు చేసిన ప్రసంగం టిడిపి క్యాడర్‌కు ప్రజాసేవకోసం మార్గదర్శకంగా నిలిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు అత్యంత ఘనంగా జరిగిన మహానాడు కార్యక్రమం ప్రశాంతంగా, క్రమశిక్షణతో కొన సాగిందన్నారు. స్త్రీ శక్తి, కార్య కర్తలే అధినేత అనే నినాదాలు ప్రస్ఫుటించేలా మహానాడు జరిగిందన్నారు. రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం తెలుగుదేశం పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు. మహానాడు హైబ్రిడ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్లతో పాటు 12 దేశాల నుంచి కార్యకర్తలు నేతలు హాజరయ్యారన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,875 డిజిటల్ క్లస్టర్ల ద్వారా సుమారు 24.5 లక్షల మంది కార్యకర్తలు, నాయకులు ఈ పండుగలో ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారన్నారు. భౌగోళిక సరిహద్దులను చెరిపివేస్తూ సాగిన ఈ ప్రయోగం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందన్నారు. సాధారణంగా ఒక బహిరంగ సభను భారీ స్థాయిలో నిర్వహిస్తే ట్రాన్స్పోర్ట్, భోజనాలు, ఇతర సౌకర్యాల కోసం కోట్ల రూపాయల ఖర్చు అవుతుందన్నారు. ముఖ్యంగా ఇంధన ధరల పెరుగుదల, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులతో చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం ఒక మాస్టర్ స్ట్రోక్ ' అని చెప్పాలన్నారు. ఖర్చును గణనీయంగా తగ్గించడమే కాకుండా, కార్యకర్తలకు వారి సొంత నియోజకవర్గాల్లోనే పండుగ వాతావరణం కల్పించడంలో ఈ విధానం విజయవంతం అయిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి అత్యంత భారీ విజయాన్ని చేకూర్చేందుకు ఈ హైబ్రిడ్ మహానాడు ఉపయోగ పడుతుం దనిఅన్నారు. ఇలాంటి వినూత్న ఆలోచనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లే నిదర్శనమని కొనియాడారు. పార్టీ కోసం ప్రాణాలు ఇచ్చే కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో ఉండడమే అసలు విజయమని తెలిపారు.ఈ రెండు రోజులపాటు మహానాడుని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ యంత్రాంగానికి ఈ సందర్భంగా పులివెందల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నమయ్య జిల్లాలో తప్పులు లేని

# ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యం కావాలి

**-జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే**

**-18 ఏళ్లు పూర్తయిన యువత ఓటరుగా నమోదు కావాలి**



**మదనపల్లి– సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లాలో తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యం కావాలని, ఇందుకు రాజకీయ పార్టీలు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎంతో అవసరమని అన్నారు. జూన్ 5వ తేదీ నుండి జూన్ 14వ తేదీ వరకు ఏఈఓలు, బీఎల్ఓలు మరియు డీఈఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఇంటింటి సర్వే విధానం, ఎన్యుమరేషన్ ఫారముల నిర్వహణ, కొత్త ఓటర్ల నమోదు విధానం, సాంకేతిక అంశాలు మరియు ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి కుటుంబాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారములు పంపిణీ చేసి, వాటిపై అంగీకార పత్రాలు సేకరిస్తారని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి అయి అర్హులైన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు, ఫోటో మార్పులు, చిరునామా మార్పులు, కుటుంబ మార్పులు వంటి వివరాలను నవీకరించనున్నట్లు తెలిపారు.అలాగే మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఇతర రాష్ట్రాలు లేదా జిల్లాలకు వలస వెళ్లిన వారి గుర్తింపు, ఒకే వ్యక్తికి బహుళ ఓటరు కార్డులు ఉన్నట్లయితే వాటి తొలగింపు వంటి చర్యలు కూడా చేపట్టనున్నట్లు చెప్పారు. ఎటువంటి అర్హత లేని పేర్లు జాబితాలో ఉండకుండా, నిజమైన అర్హులైన ఓటర్ల వివరాలు మాత్రమే నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ప్రాథమిక ఓటరు జాబితా సిద్ధమైన అనంతరం జూలై 21వ తేదీ నుండి సెప్టెంబర్ 18వ తేదీ వరకు అభ్యంతరాలు, సవరణలు మరియు క్లెయిమ్స్ స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకునేందుకు తగిన అవకాశాన్ని కల్పిస్తున్నామని అన్నారు. తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 22వ తేదీన విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని బీఎల్ఓలతో సమన్వయం చేసు కుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పూర్తి పారదర్శకతతో కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.ఓటరు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడైన వ్యక్తి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షు డు సుగవాసి ప్రసాద్ బాబు, అన్నమయ్య డిసిసి అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దర్బార్ భాష, యచోటి , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెక్షన్ సూపరిండెంట్ హరి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గ్రావెల్ రవాణాపై

# అధికారులు చర్యలు తీసుకోవాలి

**-పోలీసులకు వినతి పత్రం అందజేసిన టిడిపి నేతలు**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లెలోని గుట్టలో నుండి తవ్వకాలు చేసి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ రవాణాపై రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ వర్గీయులైన టిడిపి నేత ఎస్వీ జయచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం వేంపల్లెలో పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ తిరుపాల్ నాయక్‌కు, పులివెందులలోని డిఎస్పీ మురళి నాయక్ లకు టిడిపి నేతలు ఎస్వీ సాయి కృష్ణారెడ్డి, జయశంకర్ రెడ్డిలు గ్రావెల్ తవ్వకాలపై వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా టిడిపి నేత, మాజీ దేవస్థానం ఛైర్మన్ జయచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లి ప్రాంతంలో ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను టిడిపి నేతలైన రామమునిరెడ్డి, వీరబద్ర, మహమ్మద్, వేమ కుమార్, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు చేస్తున్నట్లు తెలిపారు. గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్న విషయం రెవెన్యూ అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పుటికీ నామా మాత్రంగా తనీఖీలు చేసి మౌనంగా ఉన్నట్లు చెప్పారు. మళ్లీ యథావిధిగా యధేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరిపి అక్రమంగా రవాణా కొనసాగిస్తు న్నారని మండిపడ్డారు. వేంపల్లె పరిధిలోని రాజీవ్ నగర్ కాలని, ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ పి-1 ప్రాంతాన్ని తాము ప్రభుత్వ అనుమతులతో చట్టబద్ధంగా లీజుకు తీసుకున్నట్లు చెప్పారు. అయితే అదే పరిసర ప్రాంతంలో, ఫైర్ స్టేషన్ వెనుక భాగంలో, కుప్పలపల్లెకు వెళ్లే రహదారి వైపు నుంచి కొంతమంది వ్యక్తులు పట్ట పగలే అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేసి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రావెల్ అక్రమ కార్యకలాపాల వలన ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, చట్టబద్ధంగా అనుమతులు తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారికి కూడా అన్యాయం జరుగుతున్నట్లు చెప్పారు.




ఈ గ్రావెల్ అక్రమ కార్యకలాపాల వెనుక సంబంధిత విఆర్ఓ శివారెడ్డి సహకారం ఉన్నట్లు తెలిపారు. ఎన్నో సార్లు అధికారులకు పిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం పట్ల పలు అనుమానాలకు దారి తీస్తున్నట్లు తెలిపారు. లీజ్ పత్రాలతో పాటు ఇతర రికార్డులను పూర్తిగా పరిశీలించి అక్రమంగా చేస్తున్న గ్రావెల్ తవ్వకాలను నిలిపి వేయాలని కోరారు. అలాగే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## హోటల్లో ఫుడ్ సేఫ్టీ ఆకస్మిక తనిఖీలు

**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలోని హోటల్లలో ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు చికెన్, మటన్ షాపులు, హోటల్లో, టీ స్టాల్లో శుభ్రత పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పరిశుభ్రత లోపించిన కొన్ని షాపులకు హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల తయారు చేయడంలోను, విక్రయాలలోనూ నిబంధనలను పాటించాలని లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మండల వ్యవసాయ శాఖ అధికారిగా బాలగంగాధర్ రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లె మండల నూతన వ్యవసాయ శాఖ అధికారిగా బాలగంగాధర్ రెడ్డి పులివెందుల ఏడీఏ ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన ఏవోను వేంపల్లె మండల ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముందున్న ఏఓ శివశంకర్ రెడ్డిని సన్మానించి ఘనంగా విడ్కోలు పలికారు. మైదుకూరు నుండి వేంపల్లెకు బాలగంగాధర్ రెడ్డి,వేంపల్లె నుండి మైదుకూరుకు శివశంకర్ రెడ్డి బదిలీ అయ్యారని ఏడీఏ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. నూతన ఏఓగా బాధ్యతలు స్వీకరించిన బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అభివృద్ధి పథకాలు రైతులకు అందేలా కృషి చేస్తానని తెలిపారు.అలాగే వేంపల్లె మండల ఎరువులు మరియు పురుగుల మందుల దుకాణదార యజమానులు స్టాక్ రిజిస్టర్లు,రికార్డుల నిర్వహణ సక్రమంగా అమలు చేస్తూ సహకరించాలని తెలిపారు.ముందున్న ఏవో శివశంకర్ రెడ్డి వేంపల్లెలో విధులు నిర్వర్తించిన ఒక సంవత్సర కాలంలో సహ కరించిన దుకాణదారులకు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల మండల ఏవో ఓబులేసు, చక్రాయపేట మండల ఏవో చంద్రశేఖర్ రెడ్డి, వేంపల్లె మండల ఏఈఓ మల్లికార్జున, వేంపల్లె అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## దళపతి సంక్షేమాలు దేశానికి స్ఫూర్తిదాయం

**- అంబేద్కర్ దళపతి రూపంలో దేశానికి లభించిన జననాయకుడు**

**- హర్యానా నుంచి తమిళనాడు వరకు పాదయాత్ర చేస్తున్న అడ్వకేట్**

**పామిడి – సూర్య వాస్తవం :** టివికె పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తమిళనాడు ముఖ్యమంత్రి హీరో విజయ్ ప్రవేశపెట్టిన ప్రజారంజిక సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలని కోరుతూ హర్యానాకు చెందిన ప్రముఖ అడ్వకేట్ సునీల్ రాజు భార్మియా హర్యానా నుంచి తమిళనాడుకు పాదయాత్ర చేస్తూ ఎపిలోని అనంతపురం జిల్లా పామిడి పట్టణమునకు శుక్రవారం చేరుకున్నారు. ఆయనకు స్థానిక పామిడిపట్టణలోని ఉర్దూ స్కూల్ గ్యారేజ్ యువత ఘనంగా స్వాగతించారు.ఈసందర్భంగా పాత్రికేయులతో సునీల్ రాజు మాట్లాడుతూ నేను చేస్తున్నది పాదయాత్ర కాదు,ప్రజా సమస్యల యాత్రని, దారి పొడవున ప్రజల కష్టాలు నష్టాలు సమస్యలను తెలుసుకుంటున్నానని, వీటన్నిటిని తమిళనాడు ముఖ్యమంత్రి హీరో విజయ్ దృష్టికి తీసుకు వెళ్తాన న్నారు. మన దేశానికి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అంబేద్కర్ దళపతి రూపంలో లభించిన జన నాయకుడు విజయ్ అన్నారు. ఆయన తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు,ప్రవర్తన శైలి, సంక్షేమాలు దేశానికి స్ఫూర్తిదాయక మన్నారు. నిరుపేద కుటుంబాలను చేరదీయడం, మహిళా రక్షణ పథకం, ఓర్పు నేర్పు సాహసం కలిగిన ఆయన యువతకు ఆదర్శప్రాయం అన్నారు. హర్యానా రాష్ట్రం, జాన్డు జిల్లాకు చెందిన వాడిని, భార్య ఇద్దరు కుమారులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్ రాజ్ భార్మియా, ఉర్దూ స్కూల్ గ్యారేజీ యువత సైఫజ్ వళి, దాదా పీరా ఫరూక్ రియాజ్ అబ్బాస్ శు భహాన్, ఇర్ఫాన్ అజారుద్దీన్ రఫీ బాబావలి తదితరులు పాల్గొన్నారు.



# లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

## - మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షించదగ్గ విషయం



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని టిడిపి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి తూ గుట్ల మధుసూదన్ రెడ్డి నివాసంలో శుక్రవారం మహిళలకు 33 శాతం 2029లో రాష్ట్రంలో కచ్చితంగా కల్పిస్తామని మంత్రి లోకేష్ చెప్పడంతో ఈ సందర్భంగా మధు నివాసంలో 150 మంది మహిళలు మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడ మహిళలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మహిళలకు 33 శాతం బిల్లును ఆమోదించకపోయినప్పటికీ. కానీ మహానాడులో మంత్రి నారా లోకేష్ 2029లో కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందని చెప్పడం ఎంతో హర్షించదగ్గ విషయమని వారన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేసారని అన్నారు .అంతే కాకుండా రాష్ట్ర హోం శాఖ మంత్రిని మహిళలను నియమించడంతోనే ఆయన మహిళల పట్ల ఎంతో గౌరవం ఉందని ఉందో తెలుస్తుందని అన్నారు. అనంతరం తుగుట్ల మధు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి లోకేష్ చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ, ఏదైనా ఆయన హామీ ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో తూగుట్ల సరోజమ్మ, తూగుట్ల గీతా కుమారి, తూగుట్ల కరుణ, లీల, సావిత్రి, లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్లు బోడబండ్ల పద్మావతి, షహీదా, సిద్దయ్య, బాబా, తదితరులు ఉన్నారు.

# 35 గ్రాముల బంగారు గొలుసు అపహరణ

**లింగాల – సూర్య వాస్తవం :** లింగాల మండల పరిధిలోని అంబకపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్ ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. అంబకపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్న సరళ దేవి ఒక్కరే ఉన్నటువంటి విషయాన్ని గమనించి దుండగులు ఆమెతో మాటలు కలిపి కొనుగోలు కోసం వచ్చినట్టుగా నటించిన ఇద్దరు దుండగులు మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించి క్షణాల్లో పరారయ్యారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు దుకాణం వద్ద ఆగి సరుకుల గురించి అడుగుతూ కొంతసేపు మాట్లాడారు. అనంతరం చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకున్న దుండగులు ఒక్కసారిగా సరళ దేవి మెడలోని 3.5 తులాల బంగారు గొలుసు (5 లక్షల రూపాయల విలువ) ను లాక్కొని వేగంగా బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు కేకలు వేయగా స్థానికులు బయటకు వచ్చేసరికి నిందితులు అతివేగంగా బైకుపై పరారయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న లింగాల ఎస్సై డి.జగదీశ్వర్ రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళ సరళ దేవి నుంచి వివరాలు సేకరించారు. ప్రధాన రహదారిలోని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నింది తులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

## ప్రభుత్వ విద్యే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది

## "మన బడి పిలుపు" కార్యక్రమంతో తల్లిదండ్రులకు అవగాహన



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** ప్రభుత్వ విద్యే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని అధికారులు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన "మన బడి పిలుపు" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లిన అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. డిజిటల్ తరగతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యా యులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజన పథకం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 పి. కస్తూరయ్య, ఎంఈఓ-2 ఎం. శంకరయ్య, రమేష్ రెడ్డి, దివ్య, మాధవయ్య, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మల్లాం విజయ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రామస్థులు, తల్లిదండ్రులు మంచి స్పందన తెలిపారు.

# కోట గ్రామంలో జేసీ కుటుంబం ప్రత్యేక పూజలు



**తాడిపత్రి – సూర్య వాస్తవం :** తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అశ్మిత్ రెడ్డి తన సతీమణితో కలిసి నెల్లూరు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన తన అమ్మమ్మ స్వగ్రామమైన కోట గ్రామాన్ని సందర్శించారు. కోట గ్రామంలోని నల్లపురెడ్డి వంశ దేవత అయిన అమ్మవారిని జేసీ అశ్మిత్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి వారు సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి దంపతులు కూడా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జేసీ కుటుంబ సభ్యుల రాకతో కోట గ్రామంలో కాసేపు సందడి వాతావరణం నెలకొంది. స్థానిక నేతలు, అభిమానులు వారికి ఘనస్వాగతం పలికారు.

# మెగా డీఎస్సీనా మెగా లీక్..

# మెగా స్కామ్.. దగా డీఎస్సీనా




**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఇది మెగా డిఎస్సీనా దగా డీఎస్సీనా పారదర్శకత ఎక్కడ ఉంది. అంటూ వైస్సార్సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు రాష్ట్ర ఉపాధక్షడు నరేందరరెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్ రెడ్డి వెంకట్ స్టేట్ జనరల్ సెక్రటరీ నవీన్ రెడ్డి కాన్స్టేన్సీ , ప్రెసిడెంట్స్ పురుషోత్తం ,కైలాష్ ,రేవంత్ రెడ్డి , జిల్లా సెక్రటరీస్ నిశాంత్ రెడ్డి, నాగరాజు, అనంతరం జిల్లా విద్యార్థి విభాగం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి పై తీవ్ర ఆరోపణలు చేశారు.

**మెరిట్ లిస్ట్, డేటా వివాదం**

పేపర్లు లీక్ అయ్యాయని, ఫలితాల తర్వాత వెబ్‌సైట్ నుండి డేటా డిలీట్ చేశారని, మెరిట్ లిస్టులు మాయం చేశారని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకత లోపించిందని, ఫలితాల సరళిలో అవకతవకలు జరిగాయని నిరుద్యోగులు భావించడానికి ఈ సాంకేతిక లోపాలు లేదా మార్పులు కారణమయ్యాయి.

**గత నోటిఫికేషన్ల రద్దు – ఆలస్యం**

గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లను రద్దు చేసి, ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ, ఎన్నికల లబ్ధి లేదా పబ్లిసిటీ కోసం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి అభ్యర్థుల జీవితాలతో ఆటలాడారనేది ప్రధాన విమర్శ.

**లీకేజీలు, డార్క్ ఆపరేషన్ ఆరోపణలు**

ఐటీ, విద్యాశాఖ మంత్రి (నారా లోకేష్‌ను ఉద్దేశిస్తూ) పరిధిలోని శాఖలలో "డార్క్ ఆపరేషన్" పేరుతో లోపాయికారీగా లీకులు జరిగాయని, దీనిపై ప్రభుత్వం మౌనం వహిస్తోందని ప్రశ్నిస్తున్నారు.

**ఇన్‌సైడర్ ర్యాంకుల వివాదం (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ )**

పరీక్ష నిర్వహణ ప్రక్రియలో లేదా విద్యాశాఖ అనుబంధ సంస్థ అయిన లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడం తీవ్ర అనుమానాలకు తావిచ్చింది. అర్హత గల అభ్యర్థుల కంటే వ్యవస్థలో ఉన్నవారికే లీకేజీల వల్ల మార్కులు వచ్చాయనేది ఇక్కడి ఆరోపణ.

**పారదర్శకత లోపం, రహస్య సందేశాలు ?**

సాధారణంగా రిక్రూట్‌మెంట్లు జరిగితే పూర్తి స్థాయి మెరిట్ లిస్టులను, ఎంపికైన వారి జాబితాలను కలెక్టరేట్లలో లేదా అధికారిక వెబ్‌సైట్లలో బహిరంగంగా ఉంచాలి. అలా కాకుండా, కేవలం ఎంపికైన వారికి మాత్రమే వ్యక్తిగతంగా మెసేజ్‌లు పంపడం వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్పోర్ట్స్ కోటా ఫేక్ సర్టిఫికెట్లు ఒ బేరసారాలు క్రీడా కోటా కింద అర్హత లేని వారికి, క్రీడల్లో ఎప్పుడూ పాల్గొనని వారికి రూ. 15 లక్షల వరకు భారీ వసూళ్లకు పాల్పడి ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెడుతున్నారని, ఇది రిక్రూట్‌మెంట్ లా లేదు, వేలం పాటలా ఉందనేది నిరుద్యోగుల ఆవేదన. అధికారుల మార్పిడి పరీక్షల ప్రక్రియ మధ్యలో టెట్ కన్వీనర్‌గా ఉన్న అధికారినే డీఎస్సీ కన్వీనర్‌గా ఉంచకుండా హఠాత్తుగా విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆ బాధ్యతల్లోకి తీసుకు రావడం వెనుక అంతర్గతంగా ఏదో మతలబు జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో పారదర్శకత నిరూపించుకోవడానికి ఐటీ/విద్యాశాఖ మంత్రిని పదవి నుంచి తప్పించి, సీబీఐ దర్యాప్తు జరిపించాలని, తద్వారా నిజమైన ప్రతిభ గల అభ్యర్థులకు న్యాయం చేయాలని లేకపోతే డిఎస్సీ విద్యార్థుల జీవితం అగమ్యగొచరంగా తయారవు తుందని ఈ పరిణామలకు భాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్ రెడ్డి డిమాండ్ చేసాడు.

# మహానాడు.. అదో మాయనాడు..

- ప్రభుత్వ వ్యతిరేకతతో అట్టర్ ఫ్లాపైన మహానాడు
- వర్చువల్ పేరుతో కోట్లాది రూపాయల కార్యకర్తల డబ్బు లూటి
- వైసీపీ ఎస్ఈసి సభ్యుడు సత్య సాయినాథ్ శర్మ



**కమలాపురం – సూర్య వాస్తవం:** మహానాడు పేరుతో తెలుగుదేశం పార్టీ 27, 28 తేదీలలో నిర్వహించిన మహానాడు ఒక మాయనాడు అని వైసిపి ఎస్ఈసి సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ అన్నారు. కడప పట్టణం లో శుక్రవారం తనను కలిసిన విలేఖరులతో ఆయన మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా మహానాడు జరిగిన తీరును గమనిస్తే ఒకప్పుడు తెలుగుదేశం కార్యకర్తలకు ఎంతో ఘనమైన మహానాడు తూతూ మంత్రంగా నిర్వహించి, కార్యకర్తల భాగస్వామ్యం కరువై ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతతో అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు . దశా దిశా లక్ష్యం నిర్దేశం లేని ప్రస్తుతం నిర్వహించిన మహానాడుతో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కార్యనిర్వాహక అధ్యక్షుడు సంయుక్తంగా కలిసి దిగజార్చారన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితుల దృష్ట్యా పోదుపు నినాదంతో వర్చువల్ మహానాడు నిర్వహించి కార్యకర్తల పొదుపు మొత్తాన్ని లూటీ చేశారని ఆయన విమర్శించారు.నెల్లూరులో నిర్వహించ తలపెట్టిన మహానాడు రద్దుచేసి పొదుపు పేరుతో వర్చువల్ మహానాడు క్లస్టర్ల వారిగా నిర్వహించి కార్యకర్తలు పొదుపు చేసుకున్న మొత్తాన్ని నీళ్లలాగా ఖర్చు చేపించారన్నారు. ప్రత్యక్షంగా నిర్వహించే మహానాడు ఖర్చుల కంటే అధిక ఖర్చులు అయ్యే విధంగా ఈ వర్చువల్ మహానాడును తెలుగుదేశం పార్టీ అగ్ర నాయకుల నిర్వహించారంటే భారత ప్రధానమంత్రి మోడీ పొదుపు మంత్రాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు కార్యనిర్వాహక జాతీయ అధ్యక్షుడు ఏ మాత్రం చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారో ప్రజలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో మహానాడు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఒక్కో క్లస్టర్ కు మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలు చొప్పున దాదాపు 60 కోట్ల రూపాయల కార్యకర్తల డబ్బును ఖర్చు పెట్టించారన్నారు.దీనికి తోడు మహానాడుకు పది రోజుల ముందు నుంచి మంత్రులు ,శాసనసభ్యులు శాసన మండలి సభ్యులు నాయకులు పరిశీలకులు వారి పర్యటనలకు మరి ఎంత ఖర్చు పెట్టి ఉంటారో వారికే తెలియాలన్నారు. ఈ రకంగా చూస్తే దాదాపు వంద కోట్లకు పైగానే మహానాడు ఖర్చు అయ్యుంటుందన్నారు ప్రత్యక్షంగా మహానాడు నిర్వహించినా కూడా ఇందులో సగం కూడా ఖర్చు అయ్యేది కాదన్నారు. మహానాడు మొత్తం తెలుగుదేశం నాయకుల పేర్లు ఎక్కడ ఎత్తని చంద్రబాబు నాయుడు లోకేష్, జగన్ నామస్మరణం మాత్రం వందల సార్లు చేయడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిందన్న విషయం రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజలకు సైతం అర్థమైందన్నారు. దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని గతంలో జరిగిన మహానాడులో సైతం తీర్మానం చేసి అనంతరం ఆ తీర్మానాన్ని నిర్లక్ష్యం చేసి వదిలేసిన విషయాన్ని పార్టీ కార్యకర్తలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. తెలుగుదేశం పార్టీని వెన్నుపోటుతో స్వాధీనం చేసుకున్న చంద్రబాబు నాయుడు దాదాపు 31 సంవత్సరాలు గడుస్తున్నా ఎన్టీఆర్ పేరు లేకుండా పార్టీపై నేటికీ కూడా పట్టు సాధించలేక పోతున్నారని ఆయన దుయ్యబట్టారు.

# మెగా డీఎస్సీపై ఆరోపణలు..

## - సమగ్ర విచారణ జరపాలంటూ వైయస్సార్ విద్యార్థి విభాగం డిమాండ్



**కమలాపురం– సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కమలాపురం నియోజకవర్గ వైయస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు యువగలం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరుద్యోగ యువతకు 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, అయితే ప్రభుత్వం ఏర్పడి చాలా నెలలు గడిచినా ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్నారు. ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ నియామక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్న ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలను జిల్లా స్థాయిలో కాకుండా కొన్ని కేంద్రాల్లో మాత్రమే నిర్వహించడం వల్ల అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా లక్షలాది ఉద్యోగాలను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా భర్తీ చేశారని గుర్తు చేశారు. అదే విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేకపోయిందని ప్రశ్నించారు.


అవనిగడ్డ కొత్తపేటకు చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పి. నవీన్ డీఎస్సీలో రెండో ర్యాంకు సాధించినప్పటికీ టీచర్ మెరిట్ జాబితాలో పేరు లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే రాయచోటి నియోజకవర్గానికి చెందిన సయీద్ జమిల్ ఏడో ర్యాంకు సాధించినా మెరిట్ లిస్టులో చోటు దక్కలేదని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. నియామక ప్రక్రియలో పారదర్శకత లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైయస్సార్ విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది.

# జూన్ 4న 'పెద్ది' రాక...

# రామ్ చరణ్ బాక్సాఫీస్ లెక్కలపై ఆసక్తికర చర్చ

**పెద్ది' విడుదలకు సిద్ధం**
**'గేమ్ ఛేంజర్' నిరాశ తర్వాత వస్తున్న భారీ బడ్జెట్ చిత్రం**
**ఉత్తర అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా 533,000 డాలర్ల వసూళ్లు**
**తెలుగు పరిశ్రమలో రెవెన్యూ షేరింగ్ వివాదాలకు చిరంజీవి చొరవతో తెర**
**జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమా**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కెరీర్‌లో ఎన్నో హిట్లు, కొన్ని ఫ్లాపులు ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ప్రపంచవ్యాప్త గుర్తింపు సాధించినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన సోలో చిత్రం 'గేమ్ ఛేంజర్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు అందరి దృష్టి ఆయన తదుపరి చిత్రం 'పెద్ది'పైనే ఉంది. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమా, చరణ్ గత చిత్రాల బాక్సాఫీస్ ఫలితాల నేపథ్యంలో ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది.

'ఆర్ఆర్ఆర్'తో సుమారు రూ.1350 కోట్ల గ్రాస్ వసూలు చేసి కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న చరణ్, 'గేమ్ ఛేంజర్'తో మాత్రం నిరాశపరిచారు. దాదాపు రూ.350-500 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఆ చిత్రం ప్రపంచవ్యాప్తంగా కేవలం రూ.203 కోట్లు మాత్రమే రాబట్టింది. అంతకుముందు 'ఆచార్య' (రూ.78 కోట్లు), 'వినయ విధేయ రామ' (రూ.94 కోట్లు) వంటి చిత్రాలు కూడా వాణిజ్యపరంగా విఫలమయ్యాయి.

అయితే 'రంగస్థలం' (రూ.216 కోట్లు), 'ధృవ' (రూ.95 కోట్లు) వంటి బ్లాక్‌బస్టర్లు ఆయన ఖాతాలో ఉన్నాయి. ఈ మిశ్రమ ఫలితాల మధ్య 'పెద్ది' రాక చరణ్ కెరీర్‌కు ఎంతో కీలకంగా మారింది.

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' ఒక గ్రామీణ క్రీడా నేపథ్యం ఉన్న యాక్షన్ డ్రామా. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుమారు రూ.350 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా, జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి.


ఉత్తర అమెరికాలో దాదాపు 19,000 టిక్కెట్లు అమ్ముడై, అడ్వాన్స్ సేల్స్ ద్వారా 533,000 డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. ఇది 'గేమ్ ఛేంజర్' ప్రీమియర్ల కోసం సాధించిన మొత్తం ప్రీ-సేల్స్‌లో 77 శాతం కావడం విశేషం.

ఇటీవల తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య తలెత్తిన రెవెన్యూ షేరింగ్ వివాదాలను పరిష్కరించడంలో మెగాస్టార్ చిరంజీవి కీలక పాత్ర పోషించారు. ఆయన చొరవతో కొత్త పర్సంటేజ్ ఆధారిత మోడల్‌కు అందరూ అంగీకరించడంతో 'పెద్ది'కి లైన్ క్లియర్ అయింది.

ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించడం, క్రీడాకారుడి పాత్ర కోసం రామ్ చరణ్ మేకోవర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. 'గేమ్ ఛేంజర్' నిరాశ తర్వాత వస్తున్న ఈ చిత్రంతో రామ్ చరణ్ భారీ విజయాన్ని అందుకొని తన బాక్సాఫీస్ సత్తాను మరోసారి నిరూపించుకుంటారని అభిమానులు, ట్రేడ్ వర్గాలు ఆశిస్తున్నాయి.

## నాగచైతన్య అనుమతి లేకుండా ఆయన ఫొటోలు, వీడియోలు వాడొద్దు

### : ఢిల్లీ హైకోర్టు



తన అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు వాడుకుంటున్నారంటూ నాగచైతన్య పిటిషన్‌తన హక్కులను కాపాడాలని కోరిన చైతూచైతూ విన్నపంపై సానుకూలంగా స్పందించిన కోర్టు తన వ్యక్తిగత గోప్యతను, హక్కులను కాపాడాలని కోరుతూ టాలీవుడ్ హీరో నాగచైతన్య ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తన అనుమతి లేకుండానే తన పేరును, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది.

నాగచైతన్య అభ్యర్థనపై ఢిల్లీ హైకోర్టు సానుకూలంగా స్పందించింది. నాగచైతన్య అనుమతి లేకుండా ఆయన పేరు, ముఖ రూపం, స్వరాన్ని వాణిజ్యపరంగా వాడకూడదని తీర్పును వెలువరించింది. నాగచైతన్య వ్యక్తిగత హక్కులను పరిరక్షిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పలువురు సినీ స్టార్లు ఢిల్లీ హైకోర్టు నుంచి ఇదే రకమైన రక్షణ పొందిన సంగతి తెలిసిందే.

## నేడు 'శ్రీనివాస్', 'మంగ' పరిచయం




జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రంలో రషా థడానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా ఒక అప్‌డేట్ బయటకు వచ్చింది. కృష్ణ జయంతి సందర్భంగా ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషిస్తున్న శ్రీను, మంగా పాత్రలను పరిచయం చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పరిచయ కార్యక్రమాన్ని ఈ రోజు (మే 30) సాయంత్రం 6 గంటల నుంచి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో నిర్వహించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రాన్ని చందమామ కథలు పిక్చర్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత సి. అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



# గిల్ సూపర్ సెంచరీ...

# ఐపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లిన గుజరాత్... రాజస్థాన్ కల చెదిరింది!

**- ఐపీఎల్ 2026 ఫైనల్ చేరిన గుజరాత్ టైటాన్స్**
**- క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు**
**- కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత సెంచరీ.. సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ**
**- రాజస్థాన్ బ్యాటర్ సూర్యవంశీ 96 పరుగుల పోరాటం వృథా**
**- మే 31న ఆర్సీబీతో గుజరాత్ టైటిల్ ఫైట్**




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (104) బాధ్యతాయుతంగా ఆడి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ అర్ధసెంచరీతో రాణించాడు. రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను రాజస్థాన్ నుంచి లాగేసుకున్నారు. ముఖ్యంగా గిల్, రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. కేవలం 53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులు చేశాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత రాహుల్ తెవాటియా (17 నాటౌట్) తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వీరోచిత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా (45 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. చివర్లో డొనోవన్ ఫెరీరా (11 బంతుల్లో 38) విధ్వంసం సృష్టించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్, కగిసో రబాడ రెండేసి వికెట్లు పడగొట్టారు.

ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు అర్హత సాధించగా, రాజస్థాన్ రాయల్స్ ప్రస్థానం టోర్నీలో ముగిసింది. మే 31న (ఆదివారం) జరిగే టైటిల్ పోరులో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడనుంది.

## ఆమె దేశానికి గర్వకారణం..

**వినేశ్ ఫొగట్‌కు సుప్రీంకోర్టులో ఊరట**
**- 2026 ఏషియన్ గేమ్స్ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు వినేశ్ ఫొగట్‌కు అనుమతి**



ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేసిన రెజ్లింగ్ ఫెడరేషన్ పిటిషన్‌పై విచారణ
వినేశ్ దేశానికి గర్వకారణమని వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు ధర్మాసనం
క్రీడా వ్యవహారాల్లో హైకోర్టుల మితిమీరిన జోక్యంపై అసహనం వ్యక్తం చేసిన కోర్టు ఈ కేసులో పూర్తి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు భారత స్టార్ రెజ్లర్, మూడుసార్లు ఒలింపియన్‌గా దేశానికి ప్రాతినిధ్యం వహించిన వినేశ్ ఫొగట్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2026 ఏషియన్ గేమ్స్ కోసం ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఆమెకు అనుమతి ఇచ్చింది. ఈ విషయంలో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

వినేశ్ ఫొగట్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని గత వారం ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మాతృత్వం అనేది ఒకరి వృత్తిపరమైన అవకాశాలను అడ్డుకునే వైకల్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే, సమాఖ్య నిబంధనల ప్రకారం వినేశ్‌కు అర్హత లేదని వాదిస్తూ డబ్ల్యూఎఫ్ఐ, ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది.ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "ఆమె స్థానంలో వేరే ఎవరైనా ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ, వినేశ్ దేశానికి గర్వకారణంగా నిలిచిన క్రీడాకారిణి" అని ధర్మాసనం అభిప్రాయపడింది. "హైకోర్టు తీర్పుతో ఆమెలో ఆశలు, అంచనాలు పెరిగాయి. ఈ దశలో మేం ఏమీ చేయలేమని చెప్పి ఆమెను వెనక్కి పంపడం సరికాదు" అని డబ్ల్యూఎఫ్ఐ తరపు న్యాయవాదికి స్పష్టం చేసింది.అయితే, వినేశ్‌కు తాత్కాలికంగా అనుమతి ఇస్తూనే, క్రీడా వ్యవహారాల్లో హైకోర్టులు తరచుగా, అత్యంత వేగంగా జోక్యం చేసుకోవడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఇవి మెడికల్ కాలేజీ అడ్మిషన్లు కాదు. జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు సంబంధించినవి. ఈ పద్ధతిలో కోర్టులు జోక్యం చేసుకొని, మొత్తం షెడ్యూల్‌ను దెబ్బతీయలేవు" అని జస్టిస్ నరసింహా వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి వినేశ్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించిన సుప్రీంకోర్టు, డబ్ల్యూఎఫ్ఐ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాల్సిందిగా వినేశ్ ఫొగట్‌ను ఆదేశించింది.

# హెచ్.ఎల్.సి అధికారులతో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సమావేశం



**శింగనమల– సూర్య వాస్తవం:** సింగనమల నియోజకవర్గ శాసనసభ్యులు బండారు శ్రావణి శ్రీ తన క్యాంప్ కార్యాలయంలో హెచ్ఎల్సి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా హెచ్ఎల్సి పరిధిలో జరుగుతున్న ఓ అండ్ ఎంపిఆర్ పనుల పురోగతి, పుట్లూరు బ్రిడ్జి పనులు, ఎంపిఆర్ డ్యామ్ గేట్ల మరమ్మతులు మరియు పురోగతి అంశాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే రాబోయే సాగు సీజన్కు రైతులకు ఎటువంటి అంతరాయం లేకుండా సాగునీరు అందిం చేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా సుబ్బరాయ సాగర్ గేట్ల మరమ్మతు పనుల సాంక్షన్ గురించి, బొప్పేపల్లి చెరువుకు సంబంధించిన అభివృద్ధి మరియు మరమ్మతు పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హెచ్ఎల్సి ఎస్సి సుధాకర్, ఈఈ. పార్థసారధి, డీఈలు, ఏఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సమాజంపై అనుచిత వ్యాఖ్యలు

## - కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య సభ డిమాండ్



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** ఆర్యవైశ్య సమాజాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన యాక్టివిస్టు పంచ్ ప్రభాకర్పై ప్రభుత్వం వెంటనే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యక్తులు కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఇలాంటి ద్వేషపూరిత ప్రచారాలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరిలో మార్పు కనిపించడం లేదని విమర్శించారు. ముఖ్యంగా పంచ్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సమాజం శతాబ్దాలుగా వ్యాపార, సేవా రంగాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుని సమాజ సేవలో ఎప్పుడూ ముందుంటుందని నాయకులు గుర్తు చేశారు. అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు ఆర్థిక సహాయం, వైద్య సేవలు, పేదల వివాహాలు, సామూహిక కళ్యాణ కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. అలాంటి సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేయడం అసహనానికి గురిచేస్తోందన్నారు. ఆర్యవైశ్య ప్రముఖుడు టీజీ వెంకటేశ్వర్లు మరియు ఆయన కుటుంబ సభ్యులపై కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. టీజీ వెంకటేశ్వర్లు కులమతాలకు అతీతంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తూ అనేక పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సమాజ సేవలో నిమగ్నమైన వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు.

రాజకీయ విమర్శలు వేరు, కుల సంఘాలను కించపరచడం వేరు అని స్పష్టం చేసిన నాయకులు, ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో అనవసర ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు. వ్యక్తిగత అభిప్రాయాల పేరుతో సమాజాల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నాలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని కోరారు. పంచ్ ప్రభాకర్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘాలు కలిసి ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. త్వరలోనే ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్లో అధికారిక ఫిర్యాదు అందజేస్తామని తెలిపారు. అవసరమైతే పరువు నష్టం దావాలు కూడా దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సభ నాయకులు సీవీ సురేష్, మురికి నాగేశ్వరరావు మాట్లాడుతూ విదేశాల్లో ఉంటూ సామాజిక వర్గాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వెనుక మరికొందరి ప్రోత్సాహం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆర్యవైశ్య సంఘాలు కూడా ఈ విషయాన్ని సీరియస్గా తీసుకుంటున్నాయని తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్యవైశ్య సభ జాయింట్ సెక్రటరీ మల్లెంకొండు ప్రతాప్, సభ్యులు జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే టిడిపి ధ్యేయం

## - టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్




**తిరుపతి– సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ 44 సంవత్సరాల నుండి ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా భారీ ఎత్తున మహానాడు నిర్వహిస్తున్నామని, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నరసింహ యాదవ్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా విపత్తు సమయంలో కూడా మహానాడు ను జూమ్ యాప్ ద్వారా నిర్వహిం చామన్నారు. ప్రస్తుతం యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఇందున పొదుపు చేయాలని ఉద్దేశంతో, 1875 కస్టర్ల కు సంబంధించి వాళ్ల వాళ్ల ముఖ్య నాయకులతో 27 28 తేదీలలో మహానాడు ను ఆన్లైన్ ద్వారా, ఆఫ్లైన్ ద్వారా, ఘనంగా నిర్వహించామని, భారీ ఎత్తున సక్సెస్ అయిందని తెలిపారు. మహానాడు ఎప్పుడు నిర్వహించిన ప్రజల సంక్షేమాన్ని అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని, వారి కోరిక అనుగుణంగా తీర్మానాలు చేయడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. ఈ మహానాడు నూతనంగా టిడిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆధ్వర్యంలో జరగడం ప్రాధాన్యతను సంతరించుకున్నదని పేర్కొన్నారు. 17 లక్షల పైన కార్యకర్తలు నాయకులు కస్టర్ల సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. గతంలో ఎన్టీఆర్ మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారని, ఆస్తిలో సమాన హక్కును కల్పించాలని, ఇప్పుడు నారా లోకేష్ పార్లమెంటు,అసెంబ్లీ, స్థానాలకు మహిళలకు భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టిడిపి 33% మహిళా రిజర్వేషన్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నదని మహానాడు వేదికగా తీర్మానం చేయడం జరిగిందన్నారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో వ్యవస్థలను నాశనం చేశారని, నీ వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా లూటీ చేసి, దోపిడీ రాజ్యంలో వాళ్ళ జేబులు నింపుకున్నారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో 9 సార్లు విద్యుత్ బిల్లులు పెంచారని అన్నారు. కోటమీ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం విద్యుత్ బిల్లులు పెంచబోమని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామని మహా వేదికగా మా నాయకులు చెప్పారన్నారు. బీసీ నాయకుల అందరితో సమావేశమై, చర్చించి, ఆదరణ త్రీ కింద అందరికీ పథకాలు అందేలా చేస్తామని తెలిపారు. సభ్యత్వం ఉన్న టిడిపి కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కోసం 160 కోట్ల ఇన్సూరెన్స్ ఇవ్వడం జరుగుతుందని మహానాడు సందర్భంగా తెలిపారు అన్నారు. ఆంధ్రప్రదేశ్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 నెలలలో సాధించామన్నారు. 23 లక్షల ఉద్యోగాల రోకల్పన చేసి, ప్రతి సంవత్సరం జనవరి నెలలో డీఎస్సీ ని నిర్వహిస్తున్నామని టిడిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తెలిపారు అన్నారు. రాజారెడ్డి కుటుంబ పాలనలో ఎవరైతే నష్టపోయిన బాధితులు వాళ్ల బాధలు చెప్పుకుంటున్నారని, వాళ్లు చేసినా అరాచకాలు ప్రజలకు తెలియజేస్తున్నారని చెప్పారు. ప్రజల సంక్షేమ అనుగుణంగానే పథకాలు రూపొందుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్, ఈ నాయకులు కృషి చేస్తున్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# చినుకు పడితే చాలు.. అరుంధతి నగర్ జలమయం



**చెన్నూరు – సూర్య వాస్తవం :** చెన్నూరు అరుంధతి నగర్లో స్వల్ప వర్షం పడినా రోడ్లు పూర్తిగా జలమయమవుతున్న పరిస్థితి స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. చినుకు పడగానే కాలనీలోని ప్రధాన వీధులు, అంతర్గత రహ దారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇంటి నుండి బయటికి రావడానికే భయ పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, రోడ్లు తక్కువ ఎత్తులో నిర్మాణం కావడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారులపైనే నిల్వవుతోంది. మురుగునీరు కూడా వర్షపు నీటితో కలిసి రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. ప్రత్యేకించి చిన్నపిల్లలు, వృద్ధులు ఇంటి బయట అడుగుపెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీరు ఇళ్ల ముందువరకు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ నీటితో దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలో సమగ్ర పరిశీలన చేపట్టి డ్రైనేజీలను శుభ్రపరచడంతో పాటు వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అరుంధతి నగర్ ప్రజలు కోరుతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పదవ తరగతి ఉత్తీర్ణులకు ప్రోత్సాహక బహుమతులు

## - దాతల సహకారాలను విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలి



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల ఆవోప వారి ఆధ్వర్యంలో పులివెందుల కనకా పరమేశ్వరి మాత దేవాలయ వ్యవస్థాపకులు కీర్తిశేషులు మేడం వెంకటరంగం శెట్టి వంశీయులు మేడం ఓబయ్య మరియు శ్రీమతి నాగలీల వారి సహకారంతో ఇటీవల పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 5 మందికి 25 వేల రూపాయల నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా మేడం వంశీయులు మాట్లాడుతూ దాతల సహకారాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ ఓబయ్య దంపతులు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఆవోపా సలహాదారులు సాయిబాబా, కడప జిల్లా ఆవోపా అధ్యక్షులు మేడం దినేష్ గుప్తా, జిల్లా సభ్యులు సుబ్రహ్మణ్యం , మహిళా మండలి అధ్యక్షురాలు మేడా సుబ్బరత్నమ్మ, పులివెందుల వాసవి ఫంక్షన్ హాల్ కోశాధికారి కాంబోజి గంగాధర్, అధ్యక్షుడు మురళికి మోహన్, కార్యదర్శి కేశవ, కోశాధికారి నామా జనార్ధన్ గుప్తా, నాగలక్ష్మి, పెనిజూరు రమేష్, రాజశేఖర్ గుప్తా, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యాలయం సందర్శించిన నేషనల్ డైరెక్టర్ షేక్ ఆస్మా

**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం :** కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం లోని మున్సిపల్ ఆఫీసు రోడ్డులో ఉన్న షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం రాత్రి నేషనల్ డైరెక్టర్ షేక్ ఆస్మా సందర్శించారు. గత కొద్ది కాలంగా చైర్మన్ మృతితో ఆలస్యమైన హ్యూమన్ రైట్స్ కార్యకలాపాలు తిరిగి వచ్చే నెల నుంచి నూతన బలమైన కమిటీతో ఈ హ్యూమన్ రైట్స్ కార్యకలాపాలు కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఎక్కడైతే మానవ హక్కులు హరించబడతాయో అక్కడ మా షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు అందుబాటులో ఉండి వారి హక్కులు వారు పొందేలా సహాయ సహకారాలు అందిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు షేక్ మహమ్మద్ రఫీ, హ్యూమన్ రైట్స్ సోషల్ మీడియా అధ్యక్షులు షేక్ జైనుల్, సీనియర్ అడ్వకేట్ పండిత్ విజయ కుమార్, మెహరాజ్, షేకున్, హ్యూమన్ రైట్స్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )